క్లుప్తంగా

నగరపాలెంలో ఓపెన్ జిమ్ ప్రారంభం



ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలో శనివారం చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో రూ.2.50 లక్షల విలువైన ఓపెన్ జిమ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు చంద్రశేఖర్ ప్రారంభించారు. పంచాయతీ పాలకవర్గం వినతి మేరకు ఈ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పల్లా సన్యాసిరావు, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. రెడ్డిపల్లి వైన్ షాపు ఎదురుగా అరటి తోటలో శనివారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.6110 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

కోడి పందాలు ఆడుతున్న 9 మంది...

మండలంలోని పొట్నూరు గ్రామ శివారులో శనివారం కోడి పందాలు ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. కోడి పందాలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.2750 నగదు, ఎనిమిది బైక్‌లు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

కేపీఎల్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస బంతాట మైదానంలో సంక్రాంతి సందర్భంగా శనివారం కేపీఎల్ 6వ సీజన్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వార్డు సచివాలయాల కన్వీనర్, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, యూత్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, సీనియర్ నాయకుడు బింగి హరి కిరణ్‌రెడ్డి, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పందిరి విజయ్, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌నాయుడు, సిమ్మల ప్రసన్న, కొయ్య రామకృష్ణారెడ్డి, ప్రగడ చంటి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



మద్దిలో కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో పైడితల్లమ్మ ఆలయం వద్ద మూడు రోజులు జరగనున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. పోటీల్లో 40 టీమ్‌లు తలపడనున్నాయి. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక మార్కెట్.. సంక్రాంతి సొంతం

- మూడు రోజులపాటు నిర్వహణ
- భారీగా తరలిరానున్న వినియోగదారులు
- బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



ప్రైవేటు మార్కెట్‌లో మట్టి పాత్రల విక్రయాలు



మెయిన్ రోడ్డులో వ్యాపారాల రద్దీ

తగరపువలస: సంక్రాంతి పర్వదినం సందర్భంగా స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో ప్రత్యేక వస్తువుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కేవలం పండగను మాత్రమే దృష్టిలో పెట్టుకుని కొనాల్సిన ప్రత్యేక వస్తువులను ఈ సీజన్‌లో ఇక్కడి ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వీటి కోసం భోగి పండగ రోజు ప్రత్యేక సంత కూడా జరుగుతుంది. ముఖ్యంగా భోగి పండగ కోసం అవసరమైన రేగుపండ్లు ఇక్కడ విస్తారంగా లభ్యమవుతుంటాయి. అలాగే మూడు రోజులపాటు అవసరమైన చెరకు, గుమ్మడి, ఉల్లికాడలు, మట్టి పాత్రలు, పెద్దలకు పెట్టే దుస్తులు, తీగ దుంపలను ఇక్కడకు తీసుకొచ్చి విక్రయిస్తారు. నియోజకవర్గం మొత్తం మీద అన్ని వస్తువులు లభ్యమయ్యే ఏకైక మార్కెట్ కావడంతో విజయనగరం జిల్లాను కలుపుకుని అయిదు మండలాల వినియోగదారులు ఇక్కడకు వస్తారు. భోగి సంతతోపాటు ఆదివారం సంత తోడు కావడంతో ఈ రోజు వేలల్లో వచ్చే విక్రయదారులు, వినియోగదారులతో ఈ ప్రాంతం కిటకిటలాడుతుంది. మకర సంక్రాంతి వరకు ఈ రద్దీ కొనసాగుతుంది. రద్దీని దృష్ట్యా భీమిలి పోలీసులు మూడు రోజులపాటు బందోబస్తు ఏర్పాటు చేస్తారు.



చెరకు, పండ్లు విక్రయాలు

పేదల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం పంపిణీ

ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల పేదల ఆరోగ్యం కోసం స్వచ్ఛంద సంస్థలు పౌష్టికాహారం పంపిణీ చేయడం గొప్ప విషయమని వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు చెప్పారు. మండలంలోని పేకేరులో భీమిలి ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ స్వచ్ఛంద సంస్థ పేద కుటుంబాలకు పౌష్టిహారం శనివారం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా మజ్జి వెంకటరావు మాట్లాడుతూ చాలా గ్రామాల్లో పిల్లలు పౌష్టికాహార లోపంతో కనిపిస్తున్నారని చెప్పారు. అలాంటి వారిని ఆదుకోవడానికి ఎస్‌వోఎస్ సంస్థ చేస్తున్న సాయం గొప్పదని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'నాడు – నేడు' పథకం కింద అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సుమారు 70 కుటుంబాలకు పౌష్టికాహార వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి దేవి, కర్రి నాయుడుబాబు, ఉపాధ్యాయుడు ఉప్పాడ రాము తదితరులు పాల్గొన్నారు.



పేకేరులో పౌష్టికాహారం అందజేస్తున్న ఎస్‌వోఎస్ ప్రతినిధులు

చిల్లర దొంగతనాల జోరు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చిల్లర దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రచార కార్యక్రమాలు, పండగల శుభాకాంక్షలు తెలియజేసేందుకు నాయకులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీల ఫ్రేమ్‌లు దొంగలపాలవుతున్నాయి. వేలాది రూపాయలు ఖర్చు చేసి కూడళ్లు, ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల ఫ్రేమ్‌లను మడిచి స్క్రాప్ దుకాణాలకు విక్రయిస్తున్నారు. ఇలాంటి చిల్లర దొంగతనాలకు సంబంధించిన సరకును నిందితులు రాములమ్మ థియేటర్ వద్ద స్క్రాప్ దుకాణానికి విక్రయిస్తున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. వీళ్లు ఆ స్క్రాప్ దుకాణానికి వెళ్లి తమ వస్తువులను గుర్తించినా నిర్వాహకులు ఎదురు తిరిగి దూషణలకు దిగుతుండటంతో తమ మర్యాద పోతుందని ఫిర్యాదులు రావడం లేదు. భీమిలి క్రైమ్ పోలీసులు ఇలాంటి చిల్లర దొంగల ఆట కట్టించాలని తగరపువలస, చిట్టివలస, సంగివలస గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ యువజన కార్యదర్శి నరేష్‌కు అభినందనలు

మధురవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమితులైన మధురవాడ చంద్రంపాలెంకు చెందిన జగ్గుపిల్లి నరేష్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును వేర్వేరుగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు వారు ఇరువురు నరేష్‌ను అభినందించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అప్పగించిన బాధ్యతలు క్రమశిక్షణతో నిర్వహించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న నరేష్

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



యువతికి బహుమతి అందిస్తున్న ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ

భీమునిపట్నం: బీచ్‌రోడ్డులోని పైలాన్ వద్ద శనివారం సాయంత్రం భీమిలి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రముఖుల సహకారంతో మహిళలకు ముగ్గులు, చిన్న పిల్లలకు సంప్రదాయ దుస్తుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మహిళలు వివిధ ఆకృతులతో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. పోటీల అనంతరం విజేతలకు ప్రముఖులు మైలిపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, కాళ్ల సన్నీ బహుమతులు అందించారు. అలాగే ఆదివారం ఉదయం అయిదు గంటలకు సామూహిక భోగి పండగ ఘనంగా నిర్వహించనున్నారు.

ముగిసిన గురు పూజోత్సవాలు

మహారాణిపేట: ఆధునిక యుగంలో రకరకాల సమస్యలతో సతమతమవుతున్న మానవాళికి పరిష్కార మార్గమొక్కటే శరణ్యమని.. అలాంటి మార్గం పరమ గురువుల బోధనల్లో లభిస్తుందని ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.ఎస్.ఎన్.రాజు(కోల్‌కతా) అన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఫంక్షన్ హాలులో శనివారం జగద్గురు పీఠం నిర్వహించిన 63వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలతో తాను ప్రభావితం చెందానన్నారు. అనంతరం పార్వతీకుమార్ రాసిన మెర్రీ లైఫ్ డే అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు 'శంబళ' అనే మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంస్థ సలహా మండలి సభ్యుడు కె.ఎస్.ఆర్.గోపాల్ (హైదరాబాద్) 'విష్ణు సహస్రనామ' ప్రసంగాల రెండవ సంపుటిని విడుదల చేశారు. సభకు అధ్యక్షత వహించిన ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురు ప్రసాద్ మాట్లాడుతూ విదేశాల్లో మత సంస్థ చేపడుతున్న జ్ఞానయజ్ఞం, రామనామ యజ్ఞ కార్యక్రమాలను వివరించారు. గురు పూజలో భాగంగా పప్పు రవిశంకర్ రుద్రాభిషేకం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కె.రవి, ఖరగ్‌పూర్‌కు చెందిన జి.వి.కృష్ణమోహన్ తమ అనుభవాలను వివరించారు. 'నావాణి 'దర్శన మాసపత్రికపై సమీక్ష జరిపారు. జగద్గురుపీఠం వివిధ కేంద్రాల నుంచి రెండు వేలమందికి పైగా సాధకులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాస్టర్ ఇ.కె. నీరాజనంతో 63వ గురుపూజోత్సవాలు ఘనంగా ముగిశాయి. సంస్థ డైరెక్టర్ అజ్జరపు శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించగా, జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పాల్గొన్నారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న బి.ఆర్.కె రాజు, కె.ఎస్.ఆర్ గోపాల్, బి.ఎస్.ఎన్.రాజు

కోలాటం బృందానికి సౌండ్ సిస్టమ్ బహూకరణ



కోలాటం బృంద సభ్యులకు సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న సర్పంచ్ చందక లక్ష్మి తదితరులు

ఆనందపురం : ఆనందపురం పంచాయతీలో గల కోలాటం బృందానికి శనివారం సౌండ్ సిస్టమ్ బహూకరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో గల ఔత్సాహిక మహిళలు గ్రూపుగా ఏర్పడి కోలాటం నేర్చుకొని తమ ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. వారిని ప్రోత్సహించడానికి సుమారు రూ.20 వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్ అందజేశామన్నారు.

కార్యక్రమంలో నాయకులు చందక సూరిబాబు, బాబీ, షిణగం రామారావు, చందక అప్పలస్వామి, అప్పలనాయుడు, శంకర తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల కట్టడికి పోలీసుల చర్యలు

ఎంవీపీకాలనీ: సంక్రాంతి పండగ వేళ.. దొంగతనాల కట్టడికి ఎంవీపీ పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. పండక్కి నగర వాసులు పెద్ద ఎత్తున సొంతూళ్లకు వెళ్తున్నారు. ఇదే అదునుగా దొంగతనాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు అవగాహన కల్పించడంతోపాటు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలుగా విడిపోయి నగరంలోని వివిధ ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శనివారం ఎంవీపీ కాలనీ క్రైం ఎస్ఐ రాందాస్ సిబ్బందికి పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు సూచనలిచ్చారు. కరపత్రాలు, ఆటో ప్రచారం ద్వారా ఊరెళ్లే వారికి అవగాహన పెంచాలని సూచించారు. ఊరెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించేలా చైతన్య పరచాలని, అలా సమాచారం ఇచ్చిన వారి నివాస ప్రాంతాలపై నిత్యం నిఘా ఉంచాలని సూచించారు. దీంతోపాటు క్రైం జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక,ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

శ్రీవారి లడ్డూల విక్రయం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో (టీటీడీ) రెండో శనివారం లడ్డూ విక్రయాలు కొనసాగాయి. లడ్డూ విక్రయాల కౌంటర్ వద్ద భక్తులు బారులుతీరారు. రూ. 50ల లడ్డూలు అందుబాటులో ఉండటంతో భక్తులు వాటిని కొనుగోలు చేశారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకులు, వేద పండితులు ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

11 మంది కోడి పందెం రాయుళ్లు అరెస్ట్

మధురవాడ: స్వతంత్రనగర్ శివారులో గుట్టుగా కోడి పందేలు ఆడుతున్న 11 మందిని పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం సాయంత్రం ఇక్కడ కోడి పందేలు ఆడుతున్నట్టు అందిన సమాచారంతో పీఎం పాలెం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి 11 మందిని అరెస్ట్ చేశారు. 2 పందెం కోళ్లు, రూ.20,800 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- అందరూ సమష్టిగా కృషి చేయాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలిలో వైఎస్సార్‌సీపీ మళ్లీ ఘన విజయం సాధించడానికి పార్టీలోని ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. శనివారం ఇక్కడి తన క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన సమాశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అయిదు రీజియన్‌లలో పార్టీ సమాశాలు నిర్వహించి అందరికీ దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. దానికి తగిన విధంగా ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో 175 స్థానాల్లోనూ పార్టీ విజయం సాధించే విధంగా ప్రత్యేక శ్రద్ధతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారిస్తున్నారన్నారు. దానికి తగిన విధంగా అందరూ ఇతర ఆలోచనలకు తావు ఇవ్వకుండా ఖచ్చితంగా గెలుపొందాలన్న లక్ష్యంతో పని చేయాలని కోరారు. తాను మొదటి నుంచి నియోజకవర్గ స్థాయిలో ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించడంతోపాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నానన్నారు. ప్రజల సమస్యతోపాటు ఆయా ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మళ్లీ ఇక్కడ తన గెలుపునకు అందరూ సంపూర్ణంగా ప్రయత్నిస్తే ఖచ్చితంగా విజయం సాధిస్తామని, ఆ మేరకు కలిసి ముందుకు నడవాలని కోరారు. 4వ వార్డు కార్పొరేటర్ దొలుపల్లి ఏడుకొండలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు యలమంచిలి సూర్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చిట్టివలసలో సంక్రాంతి అతిథులు

తగరపువలస: ఏటా సంక్రాంతి పర్వదినాల వేళ చిట్టివలస కార్మికవాడ కేంద్రంగా బొమ్మలు విక్రయించే చిరు వ్యాపారులు తమ కుటుంబాలతో వస్తుంటారు. పండగకు మూడు రోజుల ముందే వచ్చి రోడ్డు పక్కన టెంట్లు వేసుకుని బొమ్మల ప్రదర్శన ఏర్పాటు చేస్తుంటారు. ఇక్కడ పురుషులు బొమ్మలు విక్రయించగా మహిళలు, చిన్నపిల్లలు వీధుల్లో తిరుగుతూ కర్రల జంగిడిపై విక్రయిస్తుంటారు. బాణాలు, వంటపాత్రలు, బెలూన్లు, వివిధ రంగుల కళ్లజోళ్లు, ఫ్లూట్, వాహనాలు, చదరంగం బోర్డులు, తుపాకీలు, పింగాణి పాత్రలు, పులి – సింహం – భూతం మాస్కులు, గిలకలు, ప్లాస్టిక్ బొమ్మలు, బాకాలు విక్రయిస్తుంటారు. రూ.10 మొదలుకుని రూ.200 వరకు బొమ్మలు ఇక్కడ లభ్యమవుతుంటాయి. అనకాపల్లికి చెందిన షేక్ భాషా తదితర ఆరు కుటుంబాల వారు ఏటా ఇక్కడకు వచ్చి ముక్కనుమ ముగిసిన తర్వాత వెళ్లిపోతారు. అనంతరం ఉత్తరాంధ్రలోని వివిధ గ్రామాల్లో నిర్వహించే తీర్థాలు (పరసలు)కు వెళ్లి మహాశివరాత్రి వరకు వ్యాపారం చేస్తుంటారు.

గతంలో సొంతంగా తయారీ...

దశాబ్ద కాలం వరకు ఈ చిరు వ్యాపారులు రంగుల పేపర్ – రబ్బరుతో కళ్లద్దాలు, వెదురు – మట్టితో గిలకలు, బూరలు, తోలుబొమ్మలు, బెలూన్లు అక్కడికక్కడే తయారు చేసి విక్రయించేవారు. ప్రస్తుతం తయారీకి స్వస్తి పలికి ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నుంచి దిగుమతి అయ్యే రెడీమేడ్ బొమ్మలు విక్రయిస్తున్నారు. షావుకార్లు అరువుపై వీరికి ఆట వస్తువులు ఇస్తే వాటిని విక్రయించి తిరిగి ఆ మార్వాడీలకు నగదు చెల్లిస్తుంటారు. కాలం మారి విలువైన ఆట వస్తువులు వివిధ చోట్ల లభిస్తున్నా సంక్రాంతి వేళ వీరివద్ద బొమ్మలు కొనుక్కుని స్థానికులు సరదా పడుతుంటారు.



చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్ వద్ద ప్రదర్శనగా ఉంచిన బొమ్మలు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మధురవాడ: సంక్రాంతి సందర్భంగా శనివారం శిల్పారామంలో సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కళారాధన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేవస్తుతి, పుష్పాంజలి, శివాష్టకం, సరస్వతి స్తుతి, భరతవేదము, బాలగోపాల తరంగం తదితర అంశాల ప్రదర్శనలు ఆకట్టున్నాయి. అదేవిధంగా సంబరాల్లో భాగంగా భోగి పండగ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీ శివసాయి భరత నాట్య కళా బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక నాట్య, జానపద నృత్య ప్రదర్శన వుంటుందని శిల్పారామం పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.



శిల్పారామంలో నృత్య ప్రదర్శనలో కళాకారులు

ఆధునికతను స్వాగతిద్దాం.. సంప్రదాయాలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న సినీనటుడు సాయికుమార్

సినీనటుడు సాయికుమార్

ఏయూక్యాంపస్: ఆధునికతను స్వాగతిస్తూనే.. మన సంప్రదాయాలను కాపాడుకుందామని సినీనటుడు పూడిపెద్ది సాయికుమార్ పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మహా సంక్రాంతి సంబరాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులను అందించిన విశాఖ నగరం సాంస్కృతిక రాయబారిగా నిలుస్తుందన్నారు.

'నా తండ్రిది విజయనగరం జిల్లా కళ్లేపల్లి అగ్రహారం. నేను శ్రీకాకుళం జిల్లా అల్లుడినే..' అని చెబుతూ ఉత్తరాంధ్రతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భవిష్యత్ తరానికి అందించే బాధ్యతను జీవీఎల్ బృందం ఎంతో సమన్వయంతో నిర్వహించిందన్నారు.

తొలి షీల్డ్ విశాఖలోనే అందుకున్నా

నేను నటించిన తొలి చిత్రం ఛాలెంజ్ విశాఖలో చిత్రీకరించారని.. చిరంజీవితో కలిసి ఈ చిత్రంలో నటించిన సందర్భాన్ని సాయికుమార్ గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రం 100 రోజుల వేడుక విశాఖలో జరిగిందని, మొదటి షీల్డ్‌ను ఇక్కడే తీసుకున్న జ్ఞాపకాలను వివరించారు. సాయంత్రం వేళ ఉత్తరాంధ్రకు చెందిన కళాకారుల ప్రదర్శనలు, మిమిక్రీ, సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యాలు ఎంతో ప్రత్యేకమన్నారు. జీవీఎల్ మాట్లాడుతూ ఘంటసాల పాట, గోంగూర పచ్చడి తెలుగు వారికి ఎంత ఇష్టమో.. సాయికుమార్ స్వరం కూడా అంతే ఇష్టమన్నారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ఇదే ప్రాంగణంలో భోగి నిర్వహిస్తామన్నారు. డప్పు వాయిద్యాలు, గంగిరెద్దులు, థింసా నృత్యాలు, కోలాటం, కర్రసాము, సంగీత విభావరి అలరించింది. శ్రీ రామాయణ నృత్యరూపకం, ప్రాసమణి ప్రసంగం అదరహో అనేలా సాగింది. బుల్లెట్ భాస్కర్ టీం స్కిట్లు నవ్వించాయి.